కళాపరిషత్తు కర్తవ్యం

కపిల కాశీపతి

రచనలలో నాటకం ఉత్తమమైంది అన్నారు. అల్లాగే కళలలో నాట్యకళ ఉత్తమం. నాటకం రచించటానికి కవి ఒకడు చాలు. కాని, అది ప్రదర్శించడానికి ఇతరపరికరాలు అవసరం. తక్కినకళలు ఒక వ్యక్తిశ్రమవల్ల ఒప్పుతాయి. నాటకంవుద్దేశ్యం అది ప్రదర్శిస్తేనేగాని పూర్తిగాదు. ప్రదర్శనకి అనేకం అవసరం. నాలుగైదు కళలు కలిస్తేనేగాని నాటకం సంపూర్తికాదు. నృత్యగీతవాద్యాదులు నాటకానికి అంగాలు. రంగస్థలం నిర్మించడానికి చిత్రరచన కావాలి. తత్కారణంగా నటుడు ఈకళలన్నిటిలో ప్రవేశంకలిగినవాడైవుండాలి. ఈకళలన్నీ సరియైన పాళ్లలో మేళవించినప్పుడే నాటకం రాణిస్తుంది. చిత్రపటంగీసేటప్పుడు చిత్రకారుడు అనవసరమైన చోట ఒకరంగు ఉపయోగిస్తే ఎంతఅసహ్యంగా వుంటుందో, నాటకంలో అనవసరప్రదేశంలో ఈకళలలో దేనికైనా ప్రాముఖ్యం ఇస్తే అంతఅసహ్యంగా వుంటుంది. కళల మేళవింపే నాటకానికి సొగసు, జీవం.

నాటకం బాగావుండడానికి నటకుల పరస్పరసహకారం అవసరం. ఒకరు యేటికీ, మరొకరు కోటికీ లాగితే నాటకం నగుబాటుపాలవుతుంది. నటకుల సహకారానికి సాధన ముఖ్యం. ఒకనాటకం బాగుచెయ్యడానికి అందులో వివిధపాత్రధారుల ఐకమత్యం ఎంతఅవసరమో, నాటకకళ బాగుచెయ్యాలంటే దేశంలో వున్న నటకుల సాహచర్యం అంత అవసరం. ఆంధ్రనాటకకళ ఉద్ధరించాలంటే ఆంధ్రనటకుల పూనిక సాధనం. దానికి ఆంధ్రనాటకకళాపరిషత్తుఅనే సంస్థ మార్గం. పరిషత్తు చెయ్యవలసినవి, చెయ్యగలిగినవి అనేకం వున్నాయి.

నాట్యకళకి ముఖ్యం నాలుగు విషయాలు. మొదటిది, ప్రదర్శించడానికి చక్కని నాటకం వుండాలి. రెండవది, ఆడటానికి మంచినటులు వుండాలి. మూడు, నాటకం ఆడేందుకు మంచి ప్రదేశం; అదే రంగస్థలం. నాలుగు, చూడడానికి సరసులు, సహృదయులు అయిన ప్రేక్షకులు వుండాలి. నాట్యకళకి ముఖ్యభాగాలైన ఈనాలుగూ మారితేగాని కళ మారదు. మార్పులోగాని కళాభివృద్ధి లేదు. మార్పులేనిది చైతన్యం శూన్యం. ఆంధ్రనాటకకళ ప్రస్తుతం ఆస్థితిలో వుంది. దీన్ని సంరక్షించే బాధ్యత ఆంధ్రనాటకకళాపరిషత్తు పూనుకుంది.

నాటకాలు: ఆంధ్రభాషలో వుండవలసినన్ని మంచినాటకాలు లేవని లోకవిదితం. నాటకరచన పూర్వం ఏపరిస్థితులలో వున్నదో దాన్ని మించి ఒక్కఅడుగైనా దాటలేదు. వీరేశలింగంగారు అభిజ్ఞానశాకుంతలం తెనిగించిననాటినుంచీ ఆంధ్రనాటకరచనలో స్పష్టమైన మార్పుగాని, కొనియాడతగిన నూతనరీతులుగాని లేవు. ఇంకా పైపెచ్చు నీరసులచేతుల్లో పడి నాటకరచన అవమానకరంగా మారింది. దీనికి కారణం తగినంత ప్రోత్సాహం లేకపోవడమే. ఆంధ్రులలో కవులు లేరనిగాని, సామర్థ్యం లేదనిగాని, అనుకోడానికి వీలులేదు. తక్కిన

http://www.maganti.org

రాష్ట్రాలవారికి ఆంధ్రు లెందులోనూ తీసిపోరు. వీరికి మేధాశక్తి వున్నది, గాని తగినంత శ్రద్ధ లేదు. ఏవిషయంలోనూ ఆంధ్రులికి ప్రోత్సాహం లేదు. తత్కారణంగా ఉత్సాహం లేదు. నాటకరచనపోటీ స్థాపించిన నాట్యకళాపరిషత్తు ఈకొరత తీర్చవచ్చు. పదిసంవత్సరాలలో, చక్కని దేశీయమైన పదినాటకాలు చాలు, ఆంధ్రనాట్యకళకి ఉత్తేజనం కలిగించడానికి. ఇటువంటి పోటీలు పెట్టి సంవత్సరానికి ఒకటిరెండు నాటకాలు ప్రచురించి అవి ప్రదర్శిస్తూ వుంటే మంచి నాటకాలు లేనికొరత ఆంధ్రులికి అచిరకాలంలో తీరుతుంది.

నటకులు: నాటకప్రదర్శనానికి రెండవభాగం నటకులు. ఈనటకుల్ని ఏరడంలో చాలాజాగ్రత్త వుండాలి. కూనురాగం తియ్యగలిగిన ప్రతిపెద్దమనిషి రంగసింహమే మన రోజుల్లో. దానివల్లనే ఆంధ్రనాటకరంగం ఇంత అధోగతిలో వుండడం. నటకులికి కొన్ని గుణాలు అవసరం. నాటకాలలో వచ్చే ఎక్కువ పాత్రలు సౌందర్యంగా వుండాలి. కన్ను ముక్కుతీరు చక్కగా వుండాలి. శరీరసౌష్ఠవం వుండాలి. సాధారణపాత్రలికి అతిపొట్టివాడు గాని, అతిపొడుగువాడు గాని వుండకూడదు. అభినయం సహజంగా వుండాలంటే నటకుడి అవయవాలన్నీ ఆక్షేపణలేకుండా వుండాలి. వికృతం, విపరీతం అయిన పాత్రలకి వికృత స్వరూపులు వుండవచ్చు. కాని, వారిచేత రాజువేషం వేయిస్తే చూసేవారికి దుఃఖం వస్తుంది. నటకుడి ముఖంలో భావం గ్రహించడానికి వీలుగావుండాలి. సహజంగా, జన్మలోనే కొందరి ముఖాలు దీనికి సరియైనవిగా వుంటాయి. ముఖంలో వున్న కండరాలు కదలికలేక బిర్రబిగుసుకుని వుంటాయి కొందరికి. వాటినే కళాయిముఖా లంటారు. ఆకళాయిముఖాలు నాటకాలకి పనికి రావు. అందుచేత నటకుడికి ముఖ్యం అంగసౌష్ఠవం, స్వరూపం . శ్రీకృష్ణమూర్తికి దూడపెది మెలు, ముద్దునాలుక; శ్రీరామచంద్రమూర్తికి చీపురుపుల్లలవంటి కాలుచేతులు; దుష్యంత చక్రవర్తికి కుంటికాలు వుంటే రూపకం హాస్యరసప్రధానం అవుతుంది.

తరువాత నటకులికి కావలిసింది స్వచ్ఛమైన వుచ్చారణ, గాత్రం. ఈరెంటితోనూ నవరసాలు ఒప్పించవచ్చు. ముద్దమాటలాడే మొద్దబ్బాయిలు సంగీతం ఎంతపాడినా వచనం వచ్చేసరికి పప్పులో అడుగువేస్తారు. సరియైన గాత్రం, స్వచ్ఛమైన వుచ్చారణ లేని మనుష్యులు నాటకానికి పనికిరారు. పాశ్చాత్యదేశాలలో ప్రజలు మాట్లాడ్డం నాటకరంగాలనుంచి నేర్చుకుంటారు.

నటకుణ్ణి ఏరినతరువాత పాత్రౌచిత్యం చూడడం ముఖ్యం. ఎవరు ఏపాత్ర నటిస్తే సొగసుగా వుంటుందో గ్రహించాలి. ఏభైఏళ్లవాళ్లు పన్నెండేళ్ల బాలకుమారుడువేషం వెయ్యడానికి సిద్ధపడకూడదు. ఎవరికి తోచిన పాత్రలు వారి యిష్టానుసారంగా వెయ్యడం ఆంధ్ర దేశంలో ఆచారం. అది మానేస్తేనేగాని నాటకాలు బాగుపడవు.

ఇవన్నీ సమకూడాలంటే నటకులికి చిన్నతనంనుంచీ శిక్షణ అవసరం. అటువంటి శిక్షణ దొరికే ప్రదేశం మనదేశంలో లేదు. నటకుడికి విద్యకూడా అవసరమే. విద్యలేని నటశిఖామణులకి పుట్టినిల్లు తెనుగుభూమి. అవసరమైన విద్య అభ్యసిస్తూ, దానితోపాటు చిన్నతనంనుంచీ కళారాధనచేస్తూంటే కళానైపుణ్యం రాణిస్తుంది. ఈనాడు మనదేశంలో పదేళ్లు భామవేషగాడి పరికిణీలు మోసినవాడు భామవేషానికి తయారవుతున్నాడు. అదే వాని సాధన, శిక్షా

విధానం. పొట్టపొడిచినా అక్షరంముక్క వుండదు. ఎంతకాలం నాటకరంగం నిరక్షరకుక్షిగాళ్లకి కోటగా వుంటుందో, అంతకాలం నటులకి సంఘంలో మర్యాదలేదు; నాటకాలకి కళలలో ఉత్తమస్థానం లేదు.

నాటకానికి ప్రాణం నటులు. నటులు వృద్ధిలోకి వచ్చి నాగరీకులైతేనేగాని నాటకం బాగుపడదు. దీనికి మార్గాలు ఆలోచించడం కళాపరిషత్తుకర్తవ్యం. నాటకాలలో అభిరుచి వున్న బాలబాలికల్ని చేరదీసి వారికి చదువుసంధ్యలు నేర్పించి, కళలోకూడా శిక్ష ఏర్పర్చడానికి క్రమేణా కొన్నిసంస్థలు ఏర్పాటుచెయ్యవచ్చు. నటకుడికి కావలసిన విద్యావిధానం ఏమిటి అని నిర్ణయించి అది నేర్పడానికి ఒకసంస్థ సులభంగా ఏర్పర్చవచ్చు. దీనికి నిశ్చయం, శ్రద్ధా అవసరంగాని వేరుకాదు. ఇది ఒక పరిషత్తువంటి సంస్థ చెయ్యవలసినపని; వ్యక్తులు చెయ్యకలిగింది కాదు.

ప్రారంభంలో నటుల్ని పోషించి సంరక్షించడానికి సంస్థ వున్నట్టే రంగంలోంచి నిష్క్రమించినవారికి సహాయం చెయ్యడానికికూడా ఏర్పాట్లు చెయ్యవచ్చు. మనదేశంలో అనేకకార్మికసంఘాలు చూస్తున్నాం. అల్లాగే పాశ్చాత్యదేశాలలో కళాసంఘాలు వున్నాయి. కేవలం కళోపాసనేగాక, కళోపాసకుల సాంసారికవిషయాలుకూడా చూడడం ఈసంఘాల కర్తవ్యం. అకస్మాత్తుగా వ్యాధిగ్రస్తుడైన నటుడి గతి, అతని భార్యా బిడ్డల గతి ఏమిటి? అతను మరణించినతరువాత వారిగతేమిటి? గవర్నమెంటుఉద్యోగాలు చేస్తే పింఛను ఇస్తారు. వర్తకసంఘాలలో పనిచేస్తే ప్రావిడెంటుఫండు మొదలయినవి యిస్తారు. కార్మికులికి పరస్పరసహాయసంఘాలు వున్నాయి. అల్లాగే ఆంధ్రదేశంలో నటులంతా కలిసి పరిషత్తులో చేరి, తన్మూలంగా ఇటువంటి సహాయసంస్థలు ఏర్పర్చుకోవచ్చు. లేదా, నటులకి భుక్తిమీదే దృష్టివుంటుంది గాని, కళాభివృద్ధికి తోడ్పడే ఉత్సాహం వారికుండదు. కళాపరిషత్తు ఇటువంటి సహాయసంస్థలు స్థాపించగలిగితే, ఇటు కళను వుద్ధరించిందీ అవుతుంది, అటు కళోపాసకుల కడుపుకాచిందీ అవుతుంది. కడుపుకాల్తోంటే కళోపాసన చెయ్యడం దుర్లభం. ప్రతివృత్తిలోనూ, ప్రతిసంస్థలోనూ, ధర్మార్థకామమోక్షాలకు మార్గం వుండాలి. అప్పుడే అది సంపూర్తిఅవుతుంది.

రంగస్థలం: రంగస్థలం అంటే ఏదోకొందరు నానాగోత్రీభ్యమయిన నటులు ఆగోజుకు కలుసుకుని, ఏదో తోచిననాటకం, తోచినరీతిని ప్రదర్శించే ఒకకంపెనీహోలుమాత్రమే కాదు. రంగంఅంటే నాటకం ప్రదర్శించే "స్టేజీ" అనే అరుగు ఒక్కటేకాదు. ఒక్కొక్కనాటక సంఘాన్ని ఒకరంగస్థలంగా భావించవచ్చు. పదిసంవత్సరాలక్రితం తెనుగునాటకాలు నేటి ప్రదర్శనాలకంటె బాగుండేవి. దానికి కారణం దేశంలో అప్పుడున్న మంచిరంగస్థలాలు. ప్రతిపట్నంలోనూ కొందరు కళాపోషకులు నాటకసంఘాలు ఏర్పర్చి, నటుల్ని ఏరి, వార్ని పోషించి, నాట్యకళకు సహాయంచేసేవారు. ఒకసంఘంలోనటుడు మరొకసంఘంలో చేరడం అవమానకరమైన పనిగా భావించేవారు. ఆసంఘాలన్నీ ఒక్కొక్క రొకరకం నాటకాలలో పేరుపొంది ప్రఖ్యాతిగాంచినారు. నేడాసంఘాలు లేవు. ఆకళాపోషకులు లేరు. విశ్వాసహీనులైన నటుల్ని చేరదీసి పోషించిన నాట్యకళోద్ధారకులు దివాలాతీశారు; దుంపనాశనమై పోయారు. ఈనాడు నాటకసంఘాలు లేవు. నటులుమాత్రం వున్నారు. వార్ని ఆడించడా

నికి కంట్రాక్టర్లు వున్నారు. ఏపేరున్ననటుణ్ణో పిలిపించి, సత్తరకాయగాళ్లని కొందర్ని జేరదీసి కప్పలతక్కెడనాటకం ఒకటి వేయిస్తారు. అందులో పాత్రలు ధరించిన నటులు తత్పూర్వం ఒకర్నిఒకరు చూచిఅయినా వుండరు. ఒకరి ప్రవృత్తులు మరొకరికి తెలియవు. ఎవరి యిష్టానుసారం వారు అభినయించి డబ్బు చేతులో వేసుకుని రైలెక్కుతారు. దీనికంతకీ కారణం సరియైన రంగస్థలం లేకపోవడమే. నాటకకళాపరిషత్తుప్రోత్సాహంవల్ల తిరిగీ సరియైన సంఘాలు స్థాపించి చిట్లిపోయిన రంగస్థలాన్ని బాగుచేసుకోవచ్చు.

తరువాత ఆలోచించవలసింది అసలురంగస్థలం. నిజంగా ఆంధ్రదేశంలో సరియైన నాటకంహాలు లేదు. రంగస్థలానికి ఏంహంగులు వుండాలో, ఎల్లా కడితే బాగుంటుందో అని ఆలోచించి కట్టిన కంపెనీహాళ్లు లేవు. సినిమాకీ, నాటకానికీ, మీటింగులుకీ అన్నిటికీ సరిపోయే లాగున ఒక కలగూరగంపకట్టి సీనారేకులతో కప్పి రెండు రంగుగుడ్డలు,నాలుగు విరిగినబెంచీలు, కొబ్బరిపీచుకుర్చీలు అక్కడ పడెయ్యడంమినహా, హాలుకట్టేవిధం మనవారు గ్రహించలేదు. వివిధదేశాలలో నాటకంహాళ్లు ఎల్లావుంటాయో పరిశీలించి, మనశాస్త్రాలు చూసి, అందునాయిందునాగూడా మంచి ఏరుకుని శాస్త్రయుక్తంగా అన్నివీళ్లు వుండేటట్టుగా, రంగస్థలాలు ప్రతిచోటా నిర్మించాలి. దీనికి లాభంకోసం ఆసించే పెట్టుబడిదార్లని నమ్ముకుంటే వీలులేదు. నాటకప్రదర్శనాలు, రంగస్థలాలుకూడా సహకారోద్యమంలోఒకభాగంచేస్తే బాగుంటుంది. మచ్చుకి ఒకరంగస్థలమైనా నిర్మించవలసిన విధి కళాపరిషత్తుది. ఒకరిద్దరు సుప్రసిద్ధ ఆంధ్రనటకులు ఇందుకోసం ప్రయత్నిస్తున్నారని ఆమధ్య విన్నాం. మరి సద్దులేదు.

రంగస్థలంవిషయంలో ఆలోచించవలసింది ఇంకోవిషయం వుంది. సూత్రధారుడు అనే వ్యక్తి భారతీయనాటకరంగంలోంచి నిష్క్రమించినట్టే. కాని, సూత్రధారుడు చేసేపని చేసేవాళ్లు మరొకరు రాలేదు. సూత్రధారుడు సినిమాలో డైరెక్టరువంటివాడు. నాటకం యథావిధిగా నడపడానికి బాధ్యుడు. కళావిషయం చక్కగా గుర్తెరిగినవాడు. మొన్న మద్రాసులో రవీంద్రుడివద్ద శిక్షావిధానం అనుసరించిన శాంతినికేతనంనటకులు "శాపమోచనం" అనే నాటకం ప్రదర్శించారు. రవీంద్రుడు తానే స్వయంగా స్టేజిమీద కూర్చుని నాటకం నడిపించాడు. ఒక్కతప్పు లేకుండా, ఒక్కఆలస్యం, ఆక్షేపణ లేకుండా నాటకం సాంతమైంది. వారి ప్రదర్శన, వారి కళానైపుణ్యం అద్భుతంగా వుంది. ఆనాటకంజయానికి కారకుడు సూత్రధారుడు రవీంద్రుడు. ఇది కాదనేవా రుండరు. ఒక శిక్షావిధానం నియమించి, ఒక నాట్యకళాసంస్థ ఏర్పర్చి సూత్రధారుల్ని, నటుల్ని తయారుచెయ్యగలిగింది కళాపరిషత్తు.

ప్రేక్షకులు: ఆంధ్రదేశంలో సరియైన ప్రేక్షకులు లేరు. ఉన్నతాశయాలు, ఆదర్శాలు వున్న నాటకాలు ప్రదర్శిస్తే ఆనందించే మనుష్యులు బహుతక్కువ. దీనికి అవిద్య కారణం. నాటకం ఎల్లా వుండవలసిందీ, ఏవిధంగా ప్రదర్శించవలసిందీ ప్రేక్షకమహాజనం గ్రహిస్తేనేగాని "అహమ్మదు చాందిబీ", "రజాక్ దావూద్" సీనులకితప్ప ఉన్నతమైన రూపకాలకి ఆంధ్రదేశంలో తావుండదు. దీనికిగాను నాటకాలమీద సరియైన కాలంలో సరియైన విమర్శన వుండాలి. పరిషత్తుపత్రిక, "నాట్యకళ" దీనికి పూనుకోవాలి. దినవారపత్రికల్ని ప్రోత్సహించి విమర్శనలు ప్రచురింపించాలి. నిష్ఠూరమైనా నిజం చెప్పాలి. అప్పుడుగాని ప్రేక్షకజనం మనస్సు రుచులు మారవు. అవి మారితేనేగాని ఆంధ్రనాట్యకళకి భవిష్యత్తు లేదు.

http://www.maganti.org

Source: Press Academy Website, Natya Kala, Dec 1934

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan